సాక్షి
కరీంనగర్

I

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023

యజ్ఞవరాహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహస్వామి ఆలయంలో 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అంకురార్పణ, మృత్సంగ్రహణం, ధ్వజపట శయనాధివాసములు కన్నుల పండువలా నిర్వహించారు. సర్వవైదికసంస్థానం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరీంనగర్‌టౌన్: అసంక్రమిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్స్‌లకు సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుకు సంబంధించిన రిజిష్టర్ల నిర్వహణ, ఆయుష్మాన్‌భవ పోర్టల్‌లో నమోదు చేయడం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతీ శనివారం పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాలలో వివిధవ్యాధులపై వైద్య శిబిరం నిర్వహించి, కుటుంబ నియంత్రణ పద్ధతులపైన అవగాహన కల్పించాలని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిదా అతహరి, ఎంసీహెచ్ ప్రో గ్రాం అధికారి డాక్టర్ సనా జవేరియా, హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, జిల్లా ప్రోగ్రాం అధికారి పి.రవీందర్ పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి




కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో వీరబుచ్చయ్య

హుజూరాబాద్‌రూరల్: గ్రామాల్లో వందశాతం పన్ను వసూళ్లపై గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండలాలోని ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చూపొద్దని సూచించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో లత, ఎంపీడీవో జయశ్రీ, ఎస్‌బీఎం జిల్లా టీం సభ్యులు కిషన్ స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు జైపాల్ గుడ్‌బై

- టికెట్ దక్కకపోవడంతో రాజీనామా

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీకి కొత్త జైపాల్‌రెడ్డి గుడ్‌బై చెప్పారు. కరీంనగర్ అసెంబ్లీ నుంచి పార్టీ టికెట్ ఆశించిన జైపాల్, తనకు దక్కకపోవడంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. తన రాజీనామా లేఖను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి పంపించారు. తనకు అసెంబ్లీ టికెట్ ఇస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడంతోనే తాను కాంగ్రెస్‌లో చేరానని, కాని తనను పార్టీ మోసం చేసిందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా కరీంనగర్ అసెంబ్లీ నుంచి పోటీచేసేందుకు జైపాల్ ప్రయత్నిస్తూ వచ్చారు. ముందుగా బీజేపీ నుంచి పోటీకి సిద్ధపడ్డా, మారిన పరిణామాలతో ఆ తరువాత కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ నుంచి పార్టీ టికెట్‌ఇచ్చేందుకు స్పష్టమైన హామీ లభించడంతోనే పార్టీలో చేరినట్లు వార్తలు వచ్చాయి. ఒక దశలో జైపాల్ అభ్యర్థిత్వం ఖరారైనట్లు కూడా ప్రచారం జరిగింది. కాని అనూహ్యంగా బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్‌ల నడుమనే టికెట్ పోరు మిగిలిందనే సమాచారంతో జైపాల్ పార్టీని వీడారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన జైపాల్ మంగళవారం బీఆర్‌ఎస్ గూటికి చేరనున్నారు.



ప్రజలను మోసం చేయడం కన్నా.. ఎన్నికల్లో ఓడిపోవడం మేలు
– స్టీవెన్‌సన్

మీకు తెలుసా?

అంతర్గాం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రాజకీయాలకు జగిత్యాల జిల్లాలోని అంతర్గాం గ్రామం పెట్టింది పేరు. జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన మాకునూరి ధర్మారావు 1962లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే 1985లో గొడిశెల రాజేశంగౌడ్, ఇదే గ్రామానికి చెందిన సుద్దాల దేవయ్య 1985లో చొప్పదండి ఎమ్మెల్యేగా, 2018లో జగిత్యాల ఎమ్మెల్యేగా మాకునూరి సంజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.



మాకునూరి ధర్మారావు



రాజేశంగౌడ్



సుద్దాల దేవయ్య



సంజయ్‌కుమార్

ఓటు.. సత్యాగ్రహం ఈ రెండూ ప్రజల చేతిలో ఉన్న ఆయుధాలు
– గాంధీజీ



‘ఈసీ’ పసిగడుతోంది!

- అభ్యర్థులపై ఐదంచెల నిఘా
- ప్రతీ నియోజకవర్గంలో ప్రత్యేక బృందాలు
- పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు
- అభ్యర్థులు పారాహుషార్



హుజూరాబాద్‌లో పట్టుబడిన నగదు(ఫైల్)

జిల్లాలో పనిచేస్తున్న ఈసీ బృందాల వివరాలు

నియోజకవర్గం	ఫ్లయింగ్ స్క్వాడ్	వ్యయ పరిశీలన	స్టాటిస్టిక్స్ సర్వేలైన్ టీం	వీడియో సర్వేలైన్ టీం	వీడియో వ్యూవింగ్ టీం
కరీంనగర్	04	04	04	04	04
హుజూరాబాద్	04	04	04	04	04
మానకొండూర్	03	03	03	03	03
చొప్పదండి	03	03	03	03	03

కరీంనగర్ అర్బన్: అభ్యర్థులు తస్మాత్ జాగ్రత్త.. ఎన్నికల సంఘం నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు అభ్యర్థులను నీడలా వెంటాడుతోంది. ఎన్నికల నిర్వహణ, ప్రచార సరళిలో అభ్యర్థుల ఖర్చు తదితర అంశాలపై నిఘా పెట్టేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను నియమించింది. ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా పరిశీలించేందుకు నియోజకవర్గానికి ఐదు రకాల నిఘా వ్యవస్థలు పని చేస్తున్నాయి. వీటిని రెవెన్యూ, పోలీస్‌సిబ్బంది సంయుక్తంగా పరిశీలిస్తారు. మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు డివిజన్ అధికారులతో ఐదంచెల నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు స్టాటిక్ సర్వైలెన్ టీం 24గంటలపాటు పని చేస్తుంది. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పని చేస్తున్నాయి. ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారాలను అరికట్టేందుకు వీడియో సర్వైలెన్ టీం పనిచేస్తోంది. ప్రచార వాహనాలు, సరళిని నిరంతరం వీడియో చిత్రీకరణ బృందాలు చూసుకుంటాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని అకౌంట్స్ బృందాలు చూసుకుంటున్నాయి.

బృందాల పనితీరు పక్కా

జిల్లావ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలో బృందం పనితీరు పర్యవేక్షణ బాధ్యతలను నోడల్ అధికారులు శ్రీనివాస్(కరీంనగర్ నగర పాలక కమిషనర్), వి.శ్రీధర్(డీఏవో) పర్యవేక్షించనున్నారు. వీరికి సహాయకులుగా కె.వేణుమాధవ్(కొత్తపల్లి కమిషనర్), సయ్యద్ ముబిన్ అహ్మద్ (కలెక్టరేట్ సీ) ఉండనుండగా స్టాటిస్టిక్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల్లో ముగ్గురు సభ్యులు ఉంటారు. గతంలో అయిదుగురు ఉండగా సిబ్బంది కొరత దృష్ట్యా తగ్గించారు. పోలీస్ అధికారి, రెవెన్యూ అధికారి, వీడియో గ్రాఫర్ ఉంటారు. ఈ బృందాలు నిత్యం నియోజకవర్గంలో తమకు కేటాయించిన పరిధిలో పర్యటిస్తూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే వెంటనే జిల్లా ఎన్నికల అధికారులకు సమాచారం అందిస్తారు. బృందంలోని వీడియోగ్రాఫర్ అక్కడికి వెళ్లి దృశ్యాలను చిత్రీకరించి కలెక్టరేట్‌లోని వీడియో పరిశీలన బృందానికి పంపిస్తారు. పార్టీ జెండాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఎక్కడైనా ఉంటే తొలగించేందుకు సంబంధిత అధికారులకు సమాచారమిస్తారు. ఎక్కడైనా మద్యం, డబ్బులు నిల్వచేసినా, లెక్కకు మించి రవాణా చేసినా సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగిస్తారు. ఎక్సైజ్ అధికారులు సైతం ఎన్నికల సందర్భంగా ప్రత్యేకంగా తనిఖీ బృందాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టారు.

జీపీఆర్‌ఎస్‌తో పర్యవేక్షణ

ఎన్నికల నియమావళిని సమర్థంగా అమలు చేసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పాటు ఇతర బృందాలు తమకు కేటాయించిన వాహనాల్లో షెడ్యూల్ ప్రకారం తిరుగుతున్నాయా? లేదా ? అనే విషయాన్ని తెలుసుకునేందుకు ప్రతి వాహనానికి జీపీఆర్‌ఎస్ ఏర్పాటు చేయించారు.

కలెక్టర్ పమేలా సత్పతి.. సీపీ అభిషేక్ మహంతి

- ఆదేశాలు జారీచేసిన ఎన్నికల సంఘం
- ఇద్దరూ విధినిర్వహణలో రాజీపడని అధికారులే
- మాజీ డీజీపీ ఏకే మహంతి కుమారుడే అభిషేక్



పమేలా సత్పతి



అభిషేక్ మహంతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జిల్లాకు కొత్త కలెక్టర్, సీపీలను ఎన్నికల సంఘం నియమించింది. ప్రస్తుతం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా ఉన్న 2015 ఐఏఎస్ అధికారి పమేలా సత్పతిని వెంటనే కరీంనగర్ కలెక్టర్‌గా చార్జి తీసుకోవాలని, రాచకొండ ట్రాఫిక్ డీసీపీగా ఉన్న 2011 ఐపీఎస్ బ్యాచ్ అధికారి అభిషేక్ మహంతిని కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. వీరిద్దరి పోస్టింగ్ ఆదేశాలు సోమవారం సాయంత్రమే వెలువడగా.. రాత్రి 7 గంటలలోపు బాధ్యతలు తీసుకోవాలని పేర్కొనడం గమనార్హం. మొన్నటి వరకు ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన బి.గోపి, సీపీ ఎల్.సుబ్బారాయుడులను ఎన్నికల సంఘం ఈనెల 27వ తేదీన బదిలీ చేసింది. సీపీ సుబ్బారాయుడు విషయంలో బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఒత్తిళ్లను లెక్కచేయని సత్పతి

సీనియర్ ఐఏఎస్ అధికారి అయిన పమేలా సత్పతి విధినిర్వహణలో నిక్కచ్చిగా ఉంటారు. పరిపాలనలో అనవసర రాజకీయ జోక్యం అస్సలు సహించరన్న పేరుంది. ఆమె మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కన్నా ముందు భువనగిరి కలెక్టర్. ఆ సమయంలో రూ.600 కోట్ల విలువైన కాందిశీకుల భూముల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంతో ఈమెను బదిలీ చేశారని ప్రచారం జరిగింది.

పోరాడి పోస్టింగ్ తెచ్చుకున్న మహంతి

ఇక అభిషేక్ మహంతి మాజీ డీజీపీ అజిత్‌కుమార్ మహంతి చిన్న కుమారుడు. ఈయన అన్న అవినాశ్ మహంతి కూడా ఐపీఎస్ ఆఫీసరే కావడం గమనార్హం. తండ్రి, సోదరుని తరహాలోనే విధి నిర్వహణలో ఏనాడూ రాజీపడని అధికారిగా గుర్తింపు పొందారు. అభిషేక్ మహంతి ఏపీ నుంచి తెలంగాణ కేడర్‌కు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో న్యాయపోరాటం చేయడం అప్పట్లో సంచలనం రేపింది. సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం 2022 మార్చిలో క్యాట్ అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రత్యేక జీవో ద్వారా ఆయనను తెలంగాణ ప్రభుత్వం విధుల్లోకి తీసుకుంది.

ఆడబిడ్డల ఆశీర్వాదమే కొండంత అండ



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: ఆడబిడ్డల ఆశీర్వాద బలమే తనకు కొండంత అండ అని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని సీతారాంపూర్‌లో 21, 22 డివిజన్ల మహిళలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో పాటు మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై స్థానికులతో ముచ్చటించారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీల కల్లబొల్లి మాటలను నమ్మవద్దని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్‌ఫ్రంట్‌తో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. స్థానిక కార్పొరేటర్లు జంగిలి సాగర్, కోటగిరి భూమాగౌడ్, తుల బాలయ్య, మాజీ జెడ్పీటీసీ ఎడ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ఉప్పు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ పార్టీలు

కాంగ్రెస్, బీజేపీ ఢిల్లీ పార్టీలని, వారి మాటలను నమ్మి ఓట్లువేస్తే అంధకారమే తప్ప అభివృద్ధి జరగదని మంత్రి కమలాకర్ అన్నారు. సోమవారం పద్మనగర్‌లో ఆటోడ్రైవర్ల ఆత్మీయసమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణను దోచుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు వస్తున్నాయని, సీఎం కేసీఆర్‌ను ఓడించి తెలంగాణను ఆంధ్రాలో కలిపేందుకు కుట్రలు మొదలయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మేయర్ వై.సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రూప్‌సింగ్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, మద్దెల రాజేందర్, సీహెచ్ రామచంద్రం పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

సస్పెన్షన్.. రాజీనామా

- కరీంనగర్ బీజేపీలో గందరగోళ పరిస్థితులు
- ఎన్నికల నేపథ్యంలో వేడెక్కిన రాజకీయం



మర్రి భావన



మర్రి సతీశ్



కచ్చు రవి

కరీంనగర్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ బీజేపీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అటు సస్పెన్షన్... ఇటు రాజీనామాలతో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారన్న అభియోగంతో ఇద్దరు కార్పొరేటర్లపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సోమవారం సస్పెన్షన్ వేటువేసింది. కరీంనగర్ కార్పొరేషన్‌లోని 32వ డివిజన్ కార్పొరేటర్ మర్రి భావన, 38వ డివిజన్ కార్పొరేటర్ కచ్చు రవితోపాటు యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి సతీశ్‌ను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. తక్షణమే ఈ సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీకి కార్పొరేటర్ల రాజీనామా ప్రకటన

కరీంనగర్ నగరపాలక సంస్థ 32వ డివిజన్ కార్పొరేటర్ మర్రి భావన, 38వ డివిజన్ కార్పొరేటర్ కచ్చు రవితో పాటు మర్రి భావన భర్త బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి సతీశ్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సస్పెన్షన్ లేఖ విడులైన కొద్ది సేపటికే రాజీనామా లేఖ విడుదల చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సోమవారం ఫ్యాక్స్ ద్వారా రాజీనామా లేఖ పంపించినట్లు తెలిపారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ నాలుగున్నరేళ్లుగా కరీంనగర్ ప్రజలకు దూరంగా ఉంటున్నారని, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రయత్నించడం లేదని ఆరోపించారు. దీంతో తమను ఎన్నుకున్న డివిజన్ ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నామని వివరించారు. సంజయ్ నాయకత్వంలో పనిచేయలేక రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐదుకు చేరిన కార్పొరేటర్ల సంఖ్య

నగరపాలకసంస్థకు 2019 జనవరిలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీచేసినవారిలో 13మంది కార్పొరేటర్లుగా గెలుపొందారు. రెండేళ్ల క్రితం 26వ డివిజన్ కార్పొరేటర్ నక్క పద్మ, 36వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ, 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం బీజేపీకి రాజీనామా చేసిన ఇద్దరు కార్పొరేటర్లు మర్రి భావన, కచ్చురవితో పాటు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రి సతీశ్ సైతం అధికార బీఆర్‌ఎస్ పార్టీతో కొద్ది నెలలుగా టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌ను ఓడించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్
- నాగారం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం

జమ్మికుంట/ఇల్లందకుంట: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను 119 నియోజకవర్గాల్లో ఓడించడమే లక్ష్యంగా పనిచేస్తామని హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం మండలంలోని నాగారం ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన సతీమణి జమునతో కలిసి ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఇల్లందకుంట సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. నాగారంలో రాజేందర్ మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో ఇక్కడి నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నానని, హుజూరాబాద్ ఉపఎన్నికల్లో కేసీఆర్ డబ్బుసంచులు, మద్యం సీసాలతో మభ్యపెట్టినా... కేసులుపెట్టి బెదిరించినా చెల్లుబాటు కాలేదని అన్నారు. ఉప ఎన్నికల్లో హుజూరాబాద్‌లో తనపై కేసీఆర్, హరీశ్‌రావును పోటీచేయాలని సవాల్ విసిరానని, అదే పంథాతో తాను ఇప్పుడు కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీకి రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మెజార్టీ వస్తుందని అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మండల అధ్యక్షుడు సంపెల్లి సంపత్‌రావు, చెల్పూర్ సర్పంచ్ మహేందర్, బీనవేన మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

‘కరీంనగర్ టికెట్ కోమటిరెడ్డికే ఇవ్వాలి’



సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: సామాజిక సమీకరణాల పేరిట పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం చేయొద్దని కాంగ్రెస్ నగర నాయకులు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ అసెంబ్లీ టికెట్ ఎవరికి అనే విషయం కొలిక్కి వస్తున్న తరుణంలో సోమవారం డీసీసీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పూర్తిగా దిగజారిన పరిస్థితి నుంచి నేడు విజయం వైపు నడిచేలా చేసినవారిని మరిచిపోవద్దని ఈ సందర్భంగా కోరారు. గత మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ ఒక్క సీటు కూడా పార్టీ గెలవలేకపోయిందని తెలిపారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నియామకం తర్వాత కాంగ్రెస్‌కు కాసింత ఊపిరి వచ్చిందన్నారు. పలు కార్యక్రమాలతో పార్టీని మళ్లీ నిలబెట్టారని పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం కరీంనగర్‌లో విజయం సాధించే స్థాయికి చేరుకుందని వివరించారు. అసెంబ్లీ టికెట్‌ను కోమటిరెడ్డికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్, వేములవాడ స్థానాలను బీసీ నేతలైన పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్‌లకు కేటాయించిందన్నారు. బీసీలకు సముచిత స్థానం ఇచ్చామన్న సాకుతో కరీంనగర్‌లో ఓసీకి టికెట్ నిరాకరించొద్దని పేర్కొన్నారు. పారాచూట్ నాయకులను తమ నెత్తిన పెట్టవద్దని హితవు పలికారు. పార్టీ కష్టకాలంలో వెన్నంటి ఉన్న కోమటిరెడ్డికి టికెట్ ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డీసీసీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీవి హత్యా రాజకీయాలు

- ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: రాష్ట్రంలో బీజేపీ హత్యా రాజకీయాలు తగవని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు అత్యంత సన్నిహితుడైన రాజు ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి ప్రయత్నించాడని, వెంటనే అతన్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజలు హత్యా రాజకీయాలను సహించరని, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. గతంలో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సైతం కొంతమందిని హత్య చేయించారని ఆరోపించారు. బాలరాజు అనే వ్యక్తిని హత్య చేయించింది ఈటలనే అన్నారు. ప్రవీణ్ అనే యువకుడిపై పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించేలా చేసి ఆయన చావుకు కారణమయ్యాడని తెలిపారు. నవంబర్ 1 బుధవారం నుంచి తాను పెద్దఎత్తున ఎన్నికల ప్రచారం మొదలు పెట్టనున్నట్టు పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు హుజూరాబాద్ ప్రధాన చౌరస్తాకు పెద్దఎత్తున కార్యకర్తలు తరలివచ్చి తనకు మద్దతు ప్రకటించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు సురేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, తిరుపతిరెడ్డి, సందమల్ల బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు



మానకొండూర్: ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు కోరారు. మానకొండూర్ మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మానకొండూర్‌లో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అధికారంలోకి వస్తే చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ పృథ్వీరాజ్, ఎంపీటీసీ సభ్యురాళ్లు కవిత, సులోచన, ఉప సర్పంచ్ మురళి, కిరణ్‌గౌడ్, సందీప్, శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

జాతీయ సేవారత్న అవార్డు అందజేత



చిగురుమామిడి: స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్‌కు జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆయనకు అవార్డు అందజేశారు. రవీందర్ పదేళ్లుగా అక్షర ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా క్రీడాదుస్తులు, పాఠ్యపుస్తకాలు, ఉదయం అల్పాహారం అందిస్తున్నారు. అంతేకాకుండా, స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నందుకు తనకు ఈ అవార్డు వచ్చిందని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు



సైదాపూర్: మండలంలోని ఆకునూర్ ఉన్నత పాఠశాలలో కరీంనగర్ పోలీస్ కమిషనర్, సైదాపూర్ పోలీసుల ఆధ్వర్యంలో నవంబర్ 1న ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఆరోగ్యం తెలిపారు. సోమవారం పాఠశాల మైదానాన్ని వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించి, మాట్లాడారు. తాను జాతీయ వాలీబాల్ క్రీడాకారుడిగా వాలీబాల్ క్రీడాకారులకు ప్రోత్సాహకంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా అండర్-14 బాలబాలికలకు వాలీబాల్ ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు సమయానికి మైదానానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, పెటా అధ్యక్షుడు అంతడ్పుల శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ జగిత్యాల కార్యదర్శి కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీను, అనుపమరెడ్డి పాల్గొన్నారు.

స్వతంత్రుల కార్మిక క్షేత్రం



- నాలుగు దశాబ్దాలు.. 14సార్లు ఎన్నికలు
- గెలుపోటములను ప్రభావితం చేస్తున్న కార్మికులు

గోదావరిఖని: పునర్విభజనకు ముందు మేడారం (ఎస్సీ) నుంచి పునర్విభజన తర్వాత రామగుండం (జనరల్) అసెంబ్లీ నుంచి బరిలో దిగిన స్వతంత్ర అభ్యర్థులకూ నియోజకవర్గ ఓటర్లు పట్టం కడుతూ వస్తున్నారు. మేడారం నుంచి ఎం.రామ్‌గోపాల్ రెడ్డి, మాలెం మల్లేశం స్వతంత్రులుగా బరిలో దిగి విజయం సాధించారు. పునర్విభజన తర్వాత రామగుండం నుంచి ప్రధాన పార్టీలతో పోటీపడిన సోమారపు సత్యనారయణను కూడా ఓటర్లు తమ అక్కున చేరుకున్నారు. ఇక గతఎన్నికల్లో రామగుండం అసెంబ్లీ నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి కోరుకంటి చందర్ విజయం సాధించారు. సమీప బీఆర్ఎస్ అభ్యర్థి సోమారపు సత్యనారాయణపై 26,332 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మూడోస్థానంలో నిలిచారు.

మేడారం నుంచి రామగుండం దాకా..

- రామగుండం పారిశ్రామిక ప్రాంతం గతంలో మేడారం(ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండేది.
- నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రామగుండం కార్పొరేషన్‌తోపాటు పాలకుర్తి, అంతర్గాం, రామగుండం మండలాలను కలుపుకుని 2009లో రామగుండం(జనరల్) 23వ అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించింది.
- గోదావరిఖని కార్మిక క్షేత్రమే ప్రధాన కేంద్రంగా ఏర్పడింది.
- రామగుండం, అంతర్గాం, పాలకుర్తి మండలాల్లోని 266 గ్రామాలు, రామగుండం కార్పొరేషన్‌లోని 50 డివిజన్లు అసెంబ్లీ పరిధిలోకి వచ్చాయి.
- సింగరేణి, ఎన్టీపీసీ, ఏపీ జెన్‌కో, కేశోరామ్ సిమెంట్, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలు ఇక్కడి ప్రత్యేకత.
- సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, వారికుటుంబాల ప్రభావం అభ్యర్థుల గెలుపోటములపై తీవ్రప్రభావం చూపుతున్నాయి.
- నియోజకవర్గంలో ప్రస్తుతం 2,14,974మంది ఓటర్లు ఉన్నారు.
- వీరిలో సుమారు లక్ష వరకు కార్మికులు, వారి కుటుంబాలుంటాయి.
- 2009లో ఇండిపెండెంట్‌గా, 2014లో బీఆర్ఎస్ నుంచి సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా రెండుసార్లు విజయం సాధించారు.


కోరుకంటి చందర్


కొప్పుల ఈశ్వర్


సత్యనారాయణ


మాలెం మల్లేశం


మాతంగి నర్సయ్య

ఈసారి చందర్ వర్సెస్ ఠాకూర్..

కోరుకంటి చందర్ 2018లో ఇండిపెండెంట్‌గా సింహం గుర్తుపై పోటీచేసి విజయం సాధించారు. టీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ ఓటమి పాలయ్యారు. ఈసారి నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ప్రధానంగా బీఆర్ఎస్ నుంచి కోరుకంటి చందర్, కాంగ్రెస్ నుంచి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉంది. బీజేపీ నుంచి కందుల సంధ్యారాణి, ఇండిపెండెంట్‌గా సోమారపు సత్యనారాయణ బరిలో నిలవనున్నారు.

నాలుగు దశాబ్దాల తర్వాత జనరల్..

- 1957లో జనరల్‌గా ఉన్న మేడారం నియోజకవర్గంలో పీడీఎఫ్ తరఫున జి.లక్ష్మారెడ్డి, 1962లో స్వతంత్ర అభ్యర్థిగా ఎం.రాంగోపాల్‌రెడ్డి విజయం సాధించారు.
- 1967లో ఎస్సీకి కేటాయించారు.
- ఆనాడు గడిపెల్లి రాములు(కాంగ్రెస్) విజయం సాధించగా, 1972, 1978లో జి.ఈశ్వర్(కాంగ్రెస్) ఎన్నికయ్యారు.



- ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాత 1983లో జరిగిన ఎన్నికల్లో మాతంగి నర్సయ్య(టీడీపీ) కాంగ్రెస్ కంచుకోటకు బీటలు కొట్టి గెలుపొందారు.
- ఇదే సమయంలోనే నాదెండ్ల భాస్కర్‌రావు మంత్రివర్గంలో నెలపాటు మంత్రిగా పనిచేశారు.
- అయితే 1985లో ఆయనకు టికెట్ ఇవ్వకుండా సింగరేణి కార్మికుడు మాలెం మల్లేశం(టీడీపీ)కు టికెట్ ఇవ్వగా మల్లేశం ఘనవిజయం సాధించారు.
- 1989లో కాంగ్రెస్ నుంచి మాతంగి నర్సయ్య, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా మాలెం మల్లేశం, 1999లో టీడీపీ నుంచి మాతంగి నర్సయ్య గెలుపొందారు.
- బీఆర్ఎస్ ఆవిర్భవించాక 2004లో జరిగిన ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్ ఆ పార్టీ తరఫున పోటీచేసి విజయం సాధించారు.
- నియోజకవర్గాల పునర్విభజనలో 42 ఏళ్ల తర్వాత మేడారం(ఎస్సీ)ని తొలగించి రామగుండం నియోజకవర్గం(జనరల్)గా మార్పుచేశారు.
- దీంతో అంతకుముందు మున్సిపల్ చైర్మన్‌గా పనిచేసిన సోమారపు సత్యనారాయణ రెండుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

నాలుగుసార్లు స్వతంత్రులకే పట్టం..

నియోజకవర్గంలో కార్మికులు, వారి కుటుంబాల ఓట్లే అత్యధికంగా ఉన్నాయి. వీరి ఓట్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తున్నాయి. మేడారం నియోజకవర్గంలో 11సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. నాలుగుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ, ఒకసారి పీడీఎఫ్, ఒకసారి టీఆర్ఎస్, మూడుసార్లు స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందారు. 2009లో రామగుండం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కూడా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన సోమారపు సత్యనారాయణను ఎన్నుకుని ఓటర్లు విలక్షణ తీర్పు ఇచ్చారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సింహం గుర్తుపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన కోరుకంటి చందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించారు. గెలిచిన తర్వాత చందర్ అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు.

మేడారం(ఎస్సీ) అసెంబ్లీ

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
1957–62	జి.లక్ష్మారెడ్డి	పీడీఎఫ్
1962–67	ఎం.రాంగోపాల్‌రెడ్డి	స్వతంత్ర
1967–72	గడిపెల్లి రాములు	కాంగ్రెస్
1972–78	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1978–83	జి.ఈశ్వర్	కాంగ్రెస్
1983–85	మాతంగి నర్సయ్య	టీడీపీ
1985–89	మాలెం మల్లేశం	టీడీపీ
1989–94	మాతంగి నర్సయ్య	కాంగ్రెస్
1994–99	మాలెం మల్లేశం	స్వతంత్ర
1999–2004	మాతంగి నర్సయ్య	టీడీపీ
2004–09	కొప్పుల ఈశ్వర్	టీఆర్ఎస్

రామగుండం అసెంబ్లీ (జనరల్)

పదవీకాలం	ఎమ్మెల్యే	పార్టీ
2009–2014	సోమారపు సత్యనారాయణ	స్వతంత్ర
2014–2018	సోమారపు సత్యనారాయణ	టీఆర్ఎస్
2018–2023	కోరుకంటి చందర్	ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్

రామగుండం సమాచారం

జనాభా	2,93,085
ఓటర్లు	2,14,974
పురుషులు	1,08,233
మహిళలు	1,06,716
థర్డ్‌జెండర్	25

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక


ఎంపికైనవారిని అభినందిస్తున్న అధికారి రాజవీరు


శ్రీనిధిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: సిద్దిపేటలో ఈ నెల 30 నుంచి నవంబర్ 1 వరకు జరగనున్న 67వ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ యోగా పోటీలకు స్థానిక క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి కీర్తి రాజవీరు తెలిపారు. 14 ఏళ్ల బాలుర విభాగంలో జి.విఘ్నేశ్, బి.అభినయ్, బాలికల విభాగంలో జి.లక్ష్మీప్రసన్న, 17 ఏళ్ల బాలికల విభాగంలో డి.భావన ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిని సోమవారం అభినందించారు. అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.రాజమనోహర్‌రావు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ పోతన శ్రీనివాస్, యోగా కోచ్ కిష్టయ్య తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు..

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థిని పొన్నం శ్రీనిధి ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. రామగుండంలో ఇటీవల జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయి అండర్–17 బాలికల విభాగ పోటీల్లో శ్రీనిధి ప్రతిభ కనబర్చిందని పేర్కొన్నారు. సోమవారం ఆమెను అభినందించి, రాష్ట్రస్థాయిలోనూ రాణించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెనాల్‌లో దూకి యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం: కెనాల్‌లో దూకి ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్‌త్రీటౌన్ పోలీసులు తెలిపారు. సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. నగరంలోని మారుతినగర్ చెందిన బొమ్మ నాగరాజు(29) కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నెల 23న భార్యాపిల్లలను తీసుకొని, అత్తగారింటికి వెళ్లాడు. 25న ఒక్కడే తిరిగి కరీంనగర్ వచ్చాడు. 28న సాయంత్రం భార్యకు ఫోన్ చేసి, రావాలన్నాడు. కానీ, ఆమె 29న సాయంత్రం పిల్లలతో వచ్చి, భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారిళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం తిమ్మాపూర్ మండలంలోని అల్గునూర్ కెనాల్ వద్ద నాగరాజు ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. హుజూరాబాద్ సమీపంలోని నర్సింగాపూర్ ఎస్సారెస్పీ కెనాల్లో అతని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే నాగరాజు ఆత్మహత్య చేసుకొని ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుండెపోటుతో లష్కర్ మృతి

శంకరపట్నం(మానకొండూర్): గుండెపోటుతో ఇరిగేషన్ శాఖలో పని చేస్తున్న ఓ లష్కర్ (ఎస్సారెస్పీ) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని మొలంగూర్‌కు చెందిన దాసరి తిరుపతి లష్కర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం తన సోదరుడు మొగిలి ఇంట్లో శుభకార్యం ఉండటంతో వెళ్లాడు. బంధువులతో సరదాగా మాట్లాడి, బయటకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఒక్కసారిగా ఛాతిలో నొప్పి వస్తోందని అక్కడే కుప్పకూలి, చనిపోయాడు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఒకరి బలవన్మరణం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌కు చెందిన ద్యావనపల్లి మహేశ్(27) ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల పట్టణ ఏఎస్సై వేణురావు వివరాల ప్రకారం.. మహేశ్ ప్రభు త్వ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతనికి కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయ ంలో ఉరేసుకున్నాడు. మృతుని తల్లి నిర్మల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

రూ.1.74 లక్షలు పట్టివేత

రాయికల్(జగిత్యాల): మండలంలోని బోర్నపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు రూ.84,500, రూ.89,800 తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ అజయ్ తెలిపారు. సంబంధిత పత్రాలు చూపకపోవడంతో గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

నిబంధనలకు లోబడే తాత్కాలిక కార్యాలయాలు

- అభ్యర్థులకు ఎన్నికల సంఘం సూచనలు

కరీంనగర్ అర్బన్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేస్తుంటారు. నిబంధనలకు లోబడే ఏర్పాటు చేసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాల్లో స్పష్టం చేసింది. ప్రార్థనా స్థలాలకు, పాఠశాలలకు, పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్లలోపు అవి ఉండకూడదు. ఆఫీస్‌పై తమ పార్టీ జెండా, బ్యానర్లు, పార్టీ చిహ్నాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు.

మరికొన్ని సూచనలు..

- ఎన్నికల ప్రచార తేదీ ముగిసిన తర్వాత ఓటర్లు కానివారు నియోజకవర్గంలో ఉండకూడదు. అభ్యర్థికి, ఎలక్షన్ ఏజెంట్లకు ఇది వర్తించదు.
- రాత్రి 10 గంటల తర్వాత, ఉదయం 6 గంటల్లోపు మైకులు, లౌడ్ స్పీకర్లు వాడకూడదు. రాత్రి 10 గంటల తర్వాత పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేయొద్దు.
- పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరుగా నమోదై, ఫొటోతో కూడిన ఓటర్ గుర్తింపు కార్డున్న వ్యక్తి మాత్రమే పోలింగ్ ఏజెంట్‌గా అర్హుడు.
- ఎస్ఎంఎస్ అభ్యంతరకర విషయాలు, వార్తలు ప్రచారం చేయొద్దు.
- ఎన్నికల ప్రచార వాహనాలకు అనుమతి తీసుకున్నప్పటికీ సంబంధిత పత్రాలు వాహనాల ముందు అతికించకుండా గ్రామాల్లో తిప్పకూడదు.
- నామినేషన్ వేసింది మొదలు ఎన్నికల ఖర్చులను ఏరోజుకారోజు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలి.
- యజమాని అనుమతి లేకుండా ఇళ్ల గోడలపైన అభ్యర్థులకు సంబంధించిన రాతలు రాయడం, ఫ్లెక్సీలు కట్టడం వంటివి చేస్తే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

బీఆర్ఎస్ ప్రచారాన్ని అడ్డుకున్న టీచర్

- మంత్రి ఫొటోపై చెప్పుతో దాడి
- కేసు నమోదు

కరీంనగర్‌రూరల్: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకోవడంతోపాటు మంత్రి ఫొటోను చెప్పుతో కొట్టిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారు, కరీంనగర్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్ చౌరస్తాలో సోమవారం రాత్రి బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార రథంపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో అభివృద్ధి పనులను ప్రదర్శించారు. ఆ సమయంలో స్క్రీన్‌పై మంత్రి గంగుల కమలాకర్ ఫొటో కనిపించడంతో దుర్శేడ్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీరామోజు జగదీశ్వరాచారి చెప్పుతో కొట్టి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్ఎస్‌కు ఓటు వేయవద్దంటూ బిగ్గరగా అరుస్తూ హంగామా చేయడంతో ఆ పార్టీ నాయకులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఆయనను అదుపులోకి తీసుకొని, మద్యం సేవించాడా లేదా తెలుసుకునేందుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు ఆరె శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు జగదీశ్వరచారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.


చెప్పుతో కొడుతున్న ఉపాధ్యాయుడు

ఫోన్ పోయిందా.. డబ్బులు గోవిందా

- సెల్‌ఫోన్ చోరీ.. ఆపై అకౌంట్లలో నగదు మాయం
- నగదు బదిలీ యాప్‌ల ద్వారా డబ్బులు కొట్టేస్తున్న వైనం
- సులభమైన పాస్‌వర్డ్ ఉంటే అంతే సంగతులు
- జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న పోలీసులు

'నగరానికి చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన సెల్‌ఫోన్ నెలరోజుల క్రితం కరీంనగర్ కూరగాయల మార్కెట్లో పోయింది. కొత్త సెల్‌ఫోన్ తీసుకుని.. పాత నంబరుతో సిమ్‌కార్డు వేసుకున్నాడు. అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.2లక్షలు విత్‌డ్రా అయినట్లు సెల్‌కు మెసేజ్ వచ్చింది. బ్యాంకువాళ్లను సంప్రదించగా.. ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ అయినట్లు తెలిపారు. మరోవ్యక్తికి చెందిన సెల్‌ఫోన్ కూడా కూరగాయల మార్కెట్లో పోయింది. అందులోని రూ.30వేలు మాయం అయ్యాయి. ఇరువురూ.. వెంటనే పోలీసులను ఆశ్రయించగా.. విచారణ చేపట్టి.. నిందితులను పట్టుకుని జైలుకు పంపించారు. వారినుంచి పెద్ద ఎత్తున సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. ఓ ముఠా ఈ వ్యవహారం నడిపిస్తున్నట్లు గుర్తించారు'.

కరీంనగర్‌క్రైం: నగర ప్రజలు తస్మాత్ జాగ్రత్త.. రద్దీ ప్రాంతాల్లో మీ జేబుల్లోని సెల్‌ఫోన్లు జాగ్రత్త.. సెల్‌ఫోన్ల నుంచి నగదు బదిలీ చేసే యాప్‌లకు ఏర్పాటు చేసుకున్న పాస్‌వర్డ్‌లు జాగ్రత్త.. బ్యాంకు ఖాతాల్లోని నగదు జాగ్రత్త.. ఎందుకంటే నగరంలో సెల్‌ఫోన్లు విచ్చలవిడిగా చోరీకి గురవుతున్నాయి. గంటల వ్యవధిలో అందులోని నగదు మాయమవుతోంది. అది గుర్తించిన బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సెల్‌ఫోన్ల పాస్‌వర్డులు సులువుగా ఉండేలా ఏర్పాటు చేసుకోవద్దని.. రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.


ఇటీవల పోలీసులు పట్టుకున్న సెల్‌ఫోన్లు (ఫైల్)

సులువు పాస్‌వర్డులు.. నగదు మాయం

- నగరంలో ఇటీవల విచ్చలవిడిగా సెల్‌ఫోన్లు మాయమవుతున్నాయి. ఆ వెంటనే సదరు వ్యక్తుల ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా నగదు బదిలీ అవుతోంది. గమనించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు.
- ఇటీవల కరీంనగర్‌లో ఓ ముఠా రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు చోరీ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. కరీంనగర్ కూరగాయాల మార్కెట్లో పలువురి సెల్‌ఫోన్లు దొంగతనానికి గురయ్యాయి. ఓ వ్యక్తి సెల్‌ఫోన్ నుంచి రూ.2.10లక్షలు మాయమయ్యాయి.
- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేకబృందాలు రంగంలోకి దిగి నిందితులను అరెస్టు చేశారు. విచారణ సమయంలో నిందితులు చెప్పిన విషయాలు వారికి షాక్‌కు గురిచేశాయి.
- రాష్ట్రవ్యాప్తంగా రద్దీ ప్రాంతాల్లో తాము సెల్‌ఫోన్లు చోరీచేస్తామని, అందులోని నగదు బదిలీ యాప్‌ల సులువైన పాస్‌వర్డులు గుర్తించి, నగదు చోరీ చేస్తామని వెల్లడించారు. ఇప్పటి వరకు 85సెల్‌ఫోన్లు చోరీచేసి, రూ.లక్షల నగదు బదిలీ చేసుకున్నట్లు విచారణలో వివరించారు.
- సెల్‌ఫోన్లలో ఫోన్‌పే, గూగుల్‌పే వాడుతున్నవారిలో చాలామంది సులువైన పాస్‌వర్డ్‌లు పెట్టుకుంటున్నారు. వరుస నంబర్లు, ఒకే రకమైన నంబర్లు ఏర్పాటుచేసుకుంటున్నారు.
- ఈ క్రమంలో సెల్‌ఫోన్ చోరీచేసిన వారికి నగదు చోరీ చేయడం సులభతరం అవుతోంది. ప్రజలు డబ్బులకు సంబంధించిన యాప్‌లకు సులభమైనవి కాకుండా స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి



సెల్‌ఫోన్లలో వాడుతున్న ఫోన్‌పే, గూగుల్‌పే వంటి నగదు బదిలీ యాప్‌లకు సులభమైన పాస్‌వర్డ్‌లు కాకుండా స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి. చాలా మంది వరుస నంబర్లు, ఒకే నంబర్లు, సులభంగా గుర్తించే పెట్టుకోవడంతో సెల్‌ఫోన్ చోరీకి గురైనప్పుడు నగదుమాయం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
– రవికుమార్, వన్‌టౌన్ సీఐ

నాన్నా.. హాస్పిటల్‌కు పోదాం

- విషజ్వరంతో చిన్నారి మృతి
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


సమన్వి (ఫైల్)

ధర్మపురి: నాన్నా.. ఎట్లనో అయితంది.. హాస్పిటల్‌కు పోదాం.. అంటూ విషజ్వరంతో బాధ పడిన ఓ చిన్నారి మృతిచెందింది. పాప మాటలను గుర్తు చేసుకుంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన కొత్తకొండ రాజు–లక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. రాజు స్థానికంగా ఓ రెడీమేడ్ షాపు నిర్వహిస్తుండగా.. తమ పిల్లలను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. మూడో తరగతి చదువుతున్న పెద్ద పాప సమన్వి(8)కి వారం రోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో జగిత్యాల తరలించగా వైద్యులు విష జ్వరంగా తేల్చారు. చికిత్స తర్వాత కొంత నయం కావడంతో రెండు రోజుల క్రితం డిశ్చార్జి చేయడంతో ఇంటికి తీసుకువచ్చారు. ఆదివారం అర్ధరాత్రి మళ్లీ జ్వరం రావడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబసభ్యులు వెంటనే జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మనస్వి సోమవారం సాయంత్రం మృతి చెందింది.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–0, 6–1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.





ఫారూఖీ

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.



అజ్మతుల్లా



రహ్మత్ షా



హష్మతుల్లా

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీడబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఏంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241. వికెట్ల పతనం: 1–22, 2–84, 3–134, 4–139, 5–167, 6–180, 7–185, 8–230, 9–239, 10–241. బౌలింగ్: ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10–0–38–2, ఫజల్లహ్ ఫారూఖీ 10–1–34–4, నవీన్ ఉల్ హక్ 6.3–0–47–0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7–0–37–1, రషీద్ ఖాన్ 10–0–50–1, నబీ 6–0–33–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242. వికెట్ల పతనం: 1–0, 2–73, 3–131. బౌలింగ్: మదుషంక 9–0–48–2, రజిత 10–0–48–1, మాథ్యూస్ 3–0–18–0, చమీర 9.2–0–51–0, తీక్షణ 10–0–55–0, ధనంజయ డిసిల్వా 4–0–21–0.

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ × బంగ్లాదేశ్
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అనీశ్ డబుల్ ధమాకా


కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్–2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా

కౌంట్ డౌన్ స్టార్ట్



వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

అమ్మాడీ...



● మృణాల్ ఠాకూర్, నాని

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఎస్‌సి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్



''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

ప్రేమకథ షురూ



● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ



● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్త వాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. తర్వలో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్



● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం



● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్



● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.